



కాంగ్రెస్ టికెట్ ఎవరికో?

- సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు ప్రవీణ్‌రెడ్డికేనని ప్రచారం
- ఏఐసీసీ స్థాయిలో రుద్ర సంతోష్ ప్రయత్నాలు
- రాజేందర్‌రావుకు టికెట్ ఇవ్వాలని ఎమ్మెల్యేల వినతి
- ఢిల్లీ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న పార్టీవర్గాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అధికార కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి నిలిపే అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకుగాను భారతీయ జనతా పార్టీ తొమ్మిది మంది అభ్యర్థులను ప్రకటించగా, బీఆర్ఎస్ నలుగురి పేర్లను ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటి వరకు పలు దఫాలుగా చర్చలు జరిపినా అభ్యర్థిత్వాలు మాత్రం ఖరారు కాలేదు. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీకి అభ్యర్థుల జాబితాను పంపించినట్లు ప్రచారం జరుగుతున్నది. కరీంనగర్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను అభ్యర్థిగా ప్రకటించగా బీజేపీ సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కే మళ్లీ అవకాశం కల్పించింది. వీరిద్దరు ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో ప్రచారం చేస్తుండగా కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో మాత్రం ఇంకా తేలలేదు.

ఎవరికి వారుగా ప్రయత్నాలు

కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీకి రాష్ట్రం నుంచి పంపించిన జాబితాలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరును మాత్రమే పంపించారని ప్రచారం జరుగుతున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ప్రవీణ్‌రెడ్డి అభ్యర్థిత్వంవైపే మొగ్గుచూపుతున్నారని, బీఆర్ఎస్ వెలమ, బీజేపీ బీసీ అభ్యర్థులను పోటీకి దింపిన నేపథ్యంలో రెడ్డి అభ్యర్థిని రంగంలోకి దింపితే గట్టి పోటీ ఇవ్వవచ్చిని ముఖ్యమంత్రి అభిప్రాయపడుతున్నట్లు తెలిసింది. జిల్లాకే చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీ ఎన్నికల్లో తన నియోజకవర్గాన్ని కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు మారగా అక్కడ నుంచి టికెట్ ఆశించిన ప్రవీణ్‌రెడ్డికి లోక్‌సభ స్థానానికి పోటీచేసే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆమేరకే ముఖ్యమంత్రి ప్రవీణ్‌రెడ్డికి న్యాయం చేకూర్చేందుకు నిర్ణయించుకున్నారని తెలిసింది.

ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జి అభిప్రాయం

ఇటీవల నియోజకవర్గ పరిధిలోని ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఒకరు పోటీచేసి పరాజయం పాలైన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న నేత ముఖ్యమంతి రేవంత్‌రెడ్డిని కలిసి కరీంనగర్ స్థానాన్ని వెలిచాల రాజేందర్‌రావుకు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఆయనకు నియోజకవర్గ పరిధిలో సత్సంబంధాలు ఉన్నాయని, ఆర్థికంగా కూడా స్థితిమంతుడు కావడంతో ఖర్చుకు వెనుకాడాల్సిన పరిస్థితి ఉండదని తెలిపినట్లు సమాచారం. ఆయన వారికి ప్రవీణ్‌రెడ్డికి అసెంబ్లీ ఎన్నికల సమయం లోనే హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేయడంతోపాటు మీరంతా ఎన్ని డబ్బులు ఉండి విజయం సాధించారని ప్రశ్నించినట్లు తెలిసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా వెలిచాల రాజేందర్‌రావు అభ్యర్థిత్వంపై సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నా ఆయన మాత్రం ఆ విషయాన్ని ఎక్కడా వెల్లడించలేదు. తన ఎన్నికల సమయంలోనే ఇచ్చిన హామీ తెలిసిన వ్యక్తిగా ప్రవీణ్‌రెడ్డి విషయంలో ఏమి మాట్లాడకుండా మౌనం పాటిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి స్వయంగా ప్రవీణ్‌రెడ్డిపై సానుకూలత వ్యక్తం చేయడం, పార్టీ కేంద్ర కమిటీకి సింగిల్ నేమ్‌ను పంపించారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కరీంనగర్ అభ్యర్థి ప్రవీణ్‌రెడ్డేనని ఖాయంగా భావిస్తున్నారు.

అధిష్ఠానం ఆశీస్సులతో..

కరీంనగర్ స్థానాన్ని ఆశిస్తున్న రుద్ర సంతోష్‌కుమార్ తన ప్రయత్నాలను మరింత తీవ్రం చేశారని ప్రచారం జరుగుతోంది. రాహుల్‌గాంధీ టీంసభ్యుడిగా, పార్టీలో తెరవెనుక పాత్రను పోషిస్తూ వస్తున్న ఆయనకు ఏఐసీసీ స్థాయిలో ఉన్న సంబంధాలతో టికెట్ తెచ్చుకోవాలని చూస్తున్నారని తెలిసింది. రాష్ట్రం నుంచి ఒకే పేరు పంపించినా కేంద్ర ఎన్నికల కమిటీ, ఏఐసీసీ నాయకత్వం ఇతర అభ్యర్థిత్వాలను పరిశీలించి రాష్ట్రం నుంచి వచ్చిన అభ్యర్థి కంటే మెరుగైన వ్యక్తిగా భావిస్తే ఇతరులకు టికెట్ ఇచ్చే అవకాశముంది. ఆ మేరకు రుద్ర సంతోష్‌కుమార్ ఢిల్లీ స్థాయిలో తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నారని చెబుతున్నారు. కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి ఎంపిక విషయంలో జాతీయ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని కాంగ్రెస్‌వర్గాలే కాకుండా ఇతర రాజకీయ పక్షాలూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట జిల్లా ఆసుపత్రి కార్మికుల ధర్నా



ట్రేడ్ యూనియన్ కో ఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ప్రభుత్వ హాస్పిటల్ కార్మికులు

సుభాష్‌నగర్, మార్చి 4: జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయూసీసీ) గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించ లేదన్నారు. ఇంటి అద్దె కట్టలేక, నిత్యావసర వస్తువులు తెచ్చుకోలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసు పత్రుల్లో కొనసాగుతున్న కాంట్రాక్ట్ వ్యవస్థను తొలగించాలన్నారు. కార్యక్ర మంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, కళావతి, ఉపాధ్యక్షు రాలు శారద, ఏఐఎఫ్‌బీ నగర అధ్యక్షుడు సత్యారావు, బిల్డింగ్ సంఘం జిల్లా కన్వీనర్ రమేశ్, యుజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె బద్రినేత పాల్గొన్నారు.

రూ.577.52 కోట్ల అంచనాలతో బల్దియా బడ్జెట్

- అంచనాలకు భిన్నంగా రాబడి, వ్యయాలు
- గత ఏడాది రూ.621.44 కోట్ల అంచనా.. మిగులు నామమాత్రమే
- జనవరి వరకు రూ.167.09 కోట్ల రాబడి



కరీంనగర్ టౌన్, మార్చి 4: నగరపాలక సంస్థ పాలకవర్గం 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారీ అంచనాలతో 577.52 కోట్ల రూపాయలతో బడ్జెట్ రూపొందించింది. రాబడికి ఏమాత్రం తగ్గకుండా 577.50 కోట్ల వ్యయం కూడా అవుతుందని అంచనా వేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈయేడు కూడా వాస్తవాలకు భిన్నంగా గత బడ్జెట్‌లోని అంశాల్లోని అంకెలను కొంత తారుమారు చేశారు. వాస్తవాలను ప్రతిబింబింపజేసే విధంగా ఈ బడ్జెట్ లేదు.

అంచనాను అందుకోని ఆదాయం

2023-24 ఆర్థిక సంవత్సరంలో 621.44 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా పదినెలల్లో వచ్చింది 167.09 కోట్లు మాత్రమే. 621.42 కోట్ల ప్రణాళిక, ప్రణాళికేతర, ఇతర నిధుల వ్యయాలను చూపగా జనవరి 31 నాటికి అయ్యింది 170.23 కోట్లు మాత్రమే.. అంటే అంచనాలు ఘనంగా ఉంటే వాస్తవాలు భిన్నంగా ఉన్నాయని తెలుస్తోంది. గతంలో అంచనాలు వాస్తవాలకు ఎంత తేడా ఉందని, ఎలా ఉందనే అంశాలను అధికారులు లెక్కించకుండా కేవలం పద్దులను కొంత తారుమారు చేస్తూ బడ్జెట్ రూపొందించినట్లు తెలుస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఆదాయం, వ్యయం కొంత తగ్గుతుందని అంచనా వేశారే పద్దుల్లో పెద్దగా తేడాలు చూపలేదు.

రేపు బల్దియా బడ్జెట్ ప్రత్యేక సమావేశం:

నగరపాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై బుధవారం ప్రత్యేక పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఉదయం 11 గంటలకు మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన ఈ సమావేశం మున్సిపల్ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుంది. ప్రస్తుత పాలకవర్గం నాలుగేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మరో బడ్జెట్ సమావేశం ఉంటుందా ఇదే చివరిది అవుతుందా అని పాలకవర్గంలో చర్చ జరుగుతోంది. గతంలో సీఎం హామీ నిధులు, ఇతర ప్రత్యేక నిధులతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులను ప్రారంభించి అర్థాంతరంగా వదిలివేశారు. ఇప్పుడు వాటి పరిస్థితి ఏమిటి, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు ఇస్తుందా లేదా అనే అంశాలతోపాటు అంచనా బడ్జెట్, వాస్తవ బడ్జెట్‌పై చర్చ జరిగే అవకాశముంది.

శివారు ప్రాంతాలు, విలీన గ్రామాలకు ప్రాధాన్యం

గ్రీన్ బడ్జెట్‌కు ఎప్పటిలాగే 10 శాతం బడ్జెట్‌లో కేటాయించగా, శివారు, విలీన గ్రామాలకు సాధారణ నిధుల్లో ప్రాధాన్యమిస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఆస్తిపన్ను వసూళ్లలో జరిగిన లోపాలను సవరించడం, అక్రమ భవనాలను కట్టడి చేసి భవన నిర్మాణ అనుమతుల ద్వారా ఆదాయ వనరులను పెంచుకోవచ్చు. నగరంలో ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లు, ఇతరత్రా అడ్వర్టయిజ్‌మెంట్ వచ్చే వాటిద్వారా ఆదాయం పెరుగుతుంది. బల్దియా దుకాణాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకోవచ్చు. ట్రేడ్ లైసెన్సులు పూర్తిస్థాయిలో ఇచ్చి ఆదాయం పెంచుకునే అవకాశం ఉన్నా నగర పాలక పాలకవర్గం, అధికారులు ఈ అంశాలపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ ద్వారా గత ఏడాది ఆదాయం చాలా తక్కువగా రాగా, ఈసారి ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయలేదు. బడ్జెట్ ఇలా అనేక ఆదాయ మార్గాలను వదిలివేశారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వ్యయాల్లో కూడా వాస్తవాలకు భిన్నంగా అంచనాలు ఉండడంతో అంచనా బడ్జెట్ అంకెల గారడీగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన

సోలార్ రూఫ్ టాప్‌నకు పోస్టాఫీసుల్లో రిజిస్ట్రేషన్



భగత్‌నగర్, మార్చి 4: పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ప్రజలకు గ్రీన్ ఎనర్జీ వైపు మళ్లించేందుకు సోలార్ రూఫ్‌టాప్ కింద భారీగా రాయితీలు ప్రకటించింది. రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించి సహజ వనరులను రక్షించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ వినియోగంపై ప్రోత్సాహకాలు ప్రక టించింది. సౌర విద్యుత్ వినియో గాన్ని మరింత విస్తరించి సామా న్యులకు విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా సోలార్ రూఫ్‌టాప్ పథకాన్ని దేశ వ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఈ పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పోస్టాఫీసుల్లో చేయ నున్నారు.

అర్హతలు

పక్కా ఇల్లు ఉండి (గ్రౌండ్ ఫ్లోర్), ఒకటి, రెండు అంతస్తులు కలిగిన వారు రాయితీపై ఇంటి పైకప్పులపై సోలార్ ప్లేట్లను అమర్చుకోవచ్చు. ఈ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసి ఇచ్చి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తారు. గరిష్ఠంగా 78 వేల రూపాయల రాయితీ పొందే అవకాశం ఉంది. ఒక కిలో వాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న వారికి 30 వేలు, రెండు కిలో వాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న వారికి 60 వేలు, మూడు కిలో వాట్లు, లేదా అంతకన్న ఎక్కువ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న వారికి 78 వేల రూపాయల రాయితీ ఇస్తారు. పథకం రిజిస్ట్రేషన్‌ను పోస్టాఫీసుల్లో ఈనెల 8వ తేదీ వరకు చేయనున్నారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

- శివాజీ, పోస్టల్ ఎస్పీ



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియను అన్ని తపాల శాఖ కార్యాలయాల్లో ఈ నెల 8వ తేదీ చేస్తారు. పూర్తి వివరాలకు దగ్గరలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలి.

ధరణి కేసులు త్వరగా పరిష్కరించండి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మార్చి 4: పెండింగ్‌లో ఉన్న ధరణి కేసులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధరణి పెండింగ్ కేసులపై జిల్లాలోని తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పెండింగ్ ఫైళ్లను త్వరగా క్లియర్ చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధ్యతా యుతంగా పని చేయాలని, ప్రజావాణి, ప్రజాదర్బార్ విన్నపాలను వెంట వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి తహసీల్దార్లందరూ హాజరు కావాలన్నారు. ఎప్పటి సమస్యలను అప్పుడే పరిష్కరిం చాలని, నిర్లక్ష్యంగా ఉంటూ లేనిపోని ఇబ్బందులుపడవద్దని సూచించారు. ఫైల్స్ క్లియరెన్సు, పలు అంశాలపై దిశానిర్దేశనం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, డీపీవో రవీందర్, ఆర్డీవో మహేశ్వర్, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కొద్దిరోజుల్లో రంజాన్ నెల ప్రారంభం కానుందని, ఈద్గాలు, మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె రంజాన్ ఏర్పాట్లపై జిల్లా స్థాయి అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మసీదులు, ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ముఖ్యంగా తాగునీరు, లైటింగ్, పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రశాంతమైన వాతావరణంలో ముస్లింలు పండుగను ఘనంగా జరుపుకునేలా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, డీపీవో రవీందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, టౌన్ ఏసీపీ నరేందర్, ఫైర్ ఆఫీసర్ వెంకన్న పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

సుభాష్‌నగర్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాపాలన అర్జీలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. అర్జీల పరిష్కారం కోసం తీసుకున్న చర్యలకు సంబందించి సంబందించి వారం వారం ప్రత్యేక రిపోర్టు ఇవ్వాలన్నారు. మొత్తం 429 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఓపెన్ జిమ్‌లపై పట్టింపేది?

- మరమ్మతులకు నోచుకోని పరికరాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

జమ్మికుంట, మార్చి 4: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను అధికారులు పట్టించుకోవడం లేదు. జిమ్‌లలో అమర్చిన పరికరాలు మరమ్మతులకు నోచుకోలేక తప్పు పట్టిపోతున్నాయి. మరికొన్ని పరికరాలు విరిగిపోతున్నాయి.

13 పరికరాలు

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్త మున్సిపల్ కార్యాలయం, పాత మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆబాది జమ్మికుంటలో మొత్తం ఆరు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో జిమ్ములో 13 అధునాతన పరికరాలు బిగించారు. ప్రతి రోజు



విరిగి పోయిన పరికరం

స్థానికులు ఓపెన్ జిమ్‌లలో వ్యాయామం చేస్తున్నారు. ప్రారంభంలో ఓపెన్ జిమ్‌లో ఏ పరికరం పని చేయకపోయినా ఫిర్యాదు చేస్తే అధికారులు వెంటనే స్పందించే వారు. మూడేళ్లుగా పరిస్థితులు మారాయి. ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదు. అధికారులు స్పందించి జిమ్‌లలోని పరికరాలకు మరమ్మతులు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

45 పోస్టులకు 1,785 దరఖాస్తులు

సుభాష్‌నగర్, మార్చి 4: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న వివిధ రకాల 45 పోస్టులకు 1,785 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు. వైద్యాధికారి పోస్టులు 4, స్టాఫ్ నర్సులు 21, వైద్యులు స్టాఫ్‌నర్సులు 13, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ 1, ఏఎన్ఎం 1, ఫార్మాసిస్టు 3, ఇతర ఉద్యోగాలు 2 ఉన్నాయి. మెడికల్ ఆఫీసర్ ఉద్యోగానికి 14, స్టాఫ్ నర్స్ 1,581, స్టాఫ్‌నర్స్2-241, ఆప్తమెట్రిస్ట్ 11, ఏఎన్ఎం 216, జిల్లా ప్రోగ్రాం అధికారి 52, ఫార్మాసిస్టు 298, ఎంబీబీఎస్ (ఎంఎల్‌హెచ్‌పీ) 4, బీఏఎంఎస్ (ఎంఎల్‌హెచ్‌పీ) 49, బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎం (ఎంఎల్‌హెచ్‌పి)163, డీఈవో- 156 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మెరిట్ ఆదారంగా పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఎలాంటి సిఫార్సులక తావులేదని, కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ నియామకాలను పూర్తి చేస్తుందన్నారు.

రూ.7300 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,300 రూపాయలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 56 మంది రైతులు 711 క్వింటాళ్ల విడి పత్తి, 14 మంది రైతులు 32 క్వింటాళ్ల బస్తాలలో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,300, కనిష్ఠ ధర ఆరు వేల రూపాయలు చెల్లించి కొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని పురుగుల మందు డబ్బాతో మాజీ సర్పంచ్ నిరసన



పురుగుల మందు డబ్బా లాక్కుంటున్న పోలీసు

తిమ్మాపూర్, మార్చి4: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కార్యాలయం ఎదుట మన్నెంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మేడి అంజయ్య పెండింగ్ బిల్లులు చెల్లించాలని పురుగుల డబ్బాతో నిరసన తెలిపాడు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తిమ్మాపూర్ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుండగా మన్నెంపల్లి మాజీ సర్పంచ్ మేడి అంజయ్య పురుగుల మందు డబ్బాతో అక్కడికి వచ్చాడు. గమనించిన పోలీసులు పురుగుల మందు డబ్బా లాగేసుకుని అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిరిగి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీఐ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భార్య పుస్తెల తాడు కుదువపెట్టి, అప్పులు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. దానితోనే కేంద్ర, రాష్ట్ర అవార్డులు తిమ్మాపూర్ మండలానికి వచ్చాయని అన్నారు. సొంత నిధులు ఖర్చుపెట్టి గ్రామాలను అభివృద్ధి చేస్తే ఇప్పటికీ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరాడు. కొందరు మాజీ సర్పంచ్‌లు బిల్లులపై నిరసన తెలిపేందుకు వచ్చే అవకాశం ఉందని ముందస్తుగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాళేశ్వరం ఆలయ ఇన్‌చార్జి ఈవోగా ఎండపెల్లి మారుతి



ఎండపెల్లి మారుతి

కరీంనగర్ కల్చరల్, మార్చి 4: ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రసిద్ధ శైవక్షేత్రం కాళేశ్వర దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా ఎండపెల్లి మారుతికి బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. మారుతి కరీంనగర్ సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయంతో పాటు మరో రెండు ఆలయాలకు ఈవోగా ఉన్నారు. కాళేశ్వరం ఈవోగా ఉన్న మహేశ్ మార్చి 13 వరకు 15 రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో పాటు శివరాత్రి జాతర సమీపిస్తుండటంతో ఈ తాత్కాలిక నియామకం చేపట్టారు.

అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్

» అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అర్చక, ఉద్యోగులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం చేసింది. బోర్డు చైర్మన్ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, విశ్రాంత హైకోర్టు జడ్జి వామన్‌రావు ఇతర అధికారులు సచివాలయంలో సోమవారం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలు ఈ సమావేశంలో కొలిక్కి వచ్చాయి. ప్రధానంగా, దేవాదాయశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో వేతనాలు పొందుతున్న అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని తీర్మానం చేశారు. అయితే, ఒకేసారి అందరికి కాకుండా దశల వారిగా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. మొదటి విడతలో రూ.50 వేలలోపు వేతనం ఉన్నవారికి, అనంతరం పలు దఫాల్లో మిగతా వారికి హెల్త్ ఇన్సురెన్స్ కల్పించనున్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల నుంచి అర్చక, ఉద్యోగుల సమాచార సేకరణ ప్రక్రియ తక్షణం ప్రారంభించాలని దేవాదాయశాఖ అధికారుల్ని కోరారు.

బీఆర్‌ఎస్‌కు భవిష్యత్తు లేదు: కిషన్ రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి అసలు భవిష్యత్తే లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ అంటేనే ఆదివాసీల గడ్డాగా పేరుందని, ఈ ప్రాంతంలో కొమురంభీం, రాంజీ గోండు స్ఫూర్తిగా ఎన్నో పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు కూడా భవిష్యత్ లేదని ఆయన అన్నారు.

గతేడాది యాసంగి సీఎంఆర్ గడువు పెంపు

» మే 15 తేదీ వరకు అవకాశం కల్పించిన కేంద్రం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గతేడాది(2022- 23) యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును రానున్న మే నెల 15 తేదీ వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సీఎంఆర్ గడువు పెంచాలని గత ఫిబ్రవరి నెల 23 తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొని ఈ ఉత్తర్వులు ఇచ్చింది. బియ్యం రీసైక్లింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, మిల్లుల వారీగా లిఖితపూర్వకంగా షెడ్యూలు తీసుకొని, ఎఫ్‌సీఐకి డెలివరీ చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎఫ్‌సీఐ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, డెలివరీ సమయంలో బియ్యాన్ని పరీక్షించి తీసుకోవాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్.. వివిధ జిల్లాల మేనేజర్లు, డీఎస్‌వోలకు సోమవారం సర్క్యులర్ జారీచేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ఇటీవల టెండర్లు పిలిచిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మినహాయించి.. మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

5-6 నెలల తర్వాత..

ఈ సర్కారుండదు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ నేతలతో పలు అంశాలపై చర్చించారు. సిటింగ్ ఎంపీలు నామా నాగేశ్వరరావుకు ఖమ్మం, మహబూబాబాద్‌లో మాలోతు కవితకు మరోసారి పోటీకి అవకాశం ఇవ్వాలని ఈ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జులుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డిని నిర్ణయించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వారిపై ఉండే వ్యతిరేకతను బీఆర్ఎస్‌కు అనుకూలంగా మార్చుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేద్దామని పార్టీ శ్రేణులతో అన్నారు. బీఆర్ఎస్‌ను వీడుతున్న వారివల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండబోదని.. అలాంటి పరిణామాలను చూసి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన అనంతరం.. ఖమ్మంలోనూ బహిరంగ సభ చేపడతామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ ఓడిపోయినా.. అధైర్యపడాల్సిన పనిలేదని, నాయకులు ధైర్యంతో ముందడుగు వేయాలని సలహా ఇచ్చారు. పార్టీని పటిష్ఠం చేసుకోవడంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ముగ్గురితో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "బీఆర్ఎస్ పాలనలో సాగునీరు, తాగునీరు, విద్యుత్‌ను సమృద్ధిగా అందించడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో ప్రజలకు చేయాల్సింది చేశాం. అయినప్పటికీ.. వారు మనకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు. మన విలువ ప్రజలకు తొందరలోనే తెలుస్తుంది" అన్నారు. రాష్ట్రంలో రైతు బంధు, దళితబంధు వంటి పథకాలు ఎన్నికల కోసం తేలేదని, ఒక విజన్‌తో తెచ్చానని కేసీఆర్ చెప్పారు.



తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

ఎన్టీఆర్‌లాంటి నేతకే తప్పలేదు..

"రాజకీయాల్లో గెలుపోటములు సహజమే. ఎన్టీఆర్ లాంటి నేతకే ఒడుదొడుకులు తప్పలేదు.. ఆయన ముందు మనమెంత?" అని కేసీఆర్ ఈ భేటీలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో పాతాళానికి పడిపోయి కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. "అప్పట్లో టీడీపీ మన పార్టీ కంటే దారుణంగా ఓటమి చవిచూసింది. అయినప్పటికీ.. తప్పులను సరిదిద్దుకొని తిరిగి చేజిక్కించుకుంది" అని పార్టీ శ్రేణులకు గుర్తుచేశారు. "అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓడిపోవడం కూడా మంచిదే.. గుర్రం ఏదో.. గాడిదేదో తెలుసుకునే అవకాశం రాష్ట్ర ప్రజలకు వచ్చింది"ని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాగా.. ఈ సమీక్షా సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరు కాలేదు. వెంకటరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం లాంఛనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నలుగురు అభ్యర్థుల పేర్లు ఖరారు

రెండు రోజుల సమీక్షల అనంతరం కేసీఆర్ తమ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నలుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత పోటీ చేస్తారని ఆయన వెల్లడించారు.

కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలకు చెప్పండి: హరీశ్

అధికారంలోకి వచ్చి 3 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని.. అసంపూర్తిగా అమలుచేసిన రెండు, మూడు హామీల చూపించి అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని.. రాష్ట్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ నేతలతో మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమీక్ష అనంతరం తెలంగాణ భవన్‌లో ఆ రెండు నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలతో హరీశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలపై ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని సూచించారు. గల్లీలో కాంగ్రెస్ ఉన్నా, తెలంగాణ సమస్యలు ఢిల్లీ వేదికగా ప్రశ్నించేందుకు, పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాలన్నారు. కాగా.. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీనే కాక ఎవరు పోటీ చేసినా ఎదుర్కొంటామని.. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారన్నారు.



సిరిసిల్ల జిల్లా నారాయణపూర్‌లో జరిగే రేణుకామాత జమదగ్ని కల్యాణానికి రావాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గౌడ సంఘం నేతలు

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పోరుబాట

» 6న నియోజకవర్గాల కేంద్రాల్లో ధర్నాలు

» 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పోరు బాటకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను తమపార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాలవద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ బాధితులను కలుపుకొని ఈ ధర్నాలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా 33 జిల్లాల పరిధిలో ఈనెల 7న జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించాలని చెబితే రక్తమాంసాలు పీలుస్తున్నామని నాడు విమర్శించారన్నారు. గతంలో తాము ఎల్ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోర్టుకు వెళ్లారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేస్తామని గతంలో భట్టివిక్రమార్క చెప్పారని, నో ఎల్ఆర్ఎస్.. నో టీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. అదేవిధంగా ఉచితంగా భూములను క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారని, జనం సొమ్ము దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తెచ్చారని సీతక్కకూడా అన్నారని పేర్కొన్నారు. ప్రజలపై ఆర్థికభారం మోపడానికి రంగం సిద్ధం చేశారని, రాష్ట్ర ప్రజల ద్వారా రూ.20వేల కోట్లు రాబట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

ఉమ్మడి పాలమూరు నేతలతో కేటీఆర్ భేటీ

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరును ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి.. ఆయన పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

బయట పడిన చీకటి ఒప్పందం

» సభలో బీజేపీ, కాంగ్రెస్‌ల నైజం వెల్లడి

» చెవిలో పూలు పెట్టిన మోదీ, రేవంత్

» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సాయం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బయట పడిందని, ఆదిలాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి అలై బలై తీసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ వద్ద మోకరిల్లడాన్ని.. యావత్ తెలంగాణ చూసిందని, వారిద్దరి మధ్య ఉండే బడే భాయ్.. చోటే భాయ్ బంధం ప్రజల ముందే బహిర్గతమైందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో సోమవారం మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీల మధ్య అవగాహన కుదిరిందని, ఉత్తర తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్ సహాయం చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల చెవిలో రేవంత్‌రెడ్డి కాలీఫ్లవర్ పెడితే.. మోదీ కమలం పువ్వు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి రుణం అడిగితే.. కేంద్రం ఇబ్బంది పెట్టిందని.. అదే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తీసుకోవడానికి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ ఒక్క మాట కూడా అనరని, మాజీ సీఎం కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ.. అదానీ బంధంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే.. రేవంత్ మాత్రం అదానీతో ఒప్పందం చేసుకుంటున్నారని, ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతల్లో ఎవరిని నమ్మాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి నిలదీశారు.

ఓఆర్ఆర్ లీజు బేస్ ప్రైస్ రూ.7300 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించడంపై నిరుడు ఏప్రిల్ 28న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికతో ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం సృష్టించింది. తాము అధికారంలోకి వచ్చాక దీనిపై విచారణ జరిపిస్తామని టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రకటించారు. సీఎం కాగానే దీనిపై హెచ్ఎండీఏ అధికారుల నుంచి పూర్తిస్థాయి నివేదిక కోరారు. టెండర్లు ఆహ్వానించినప్పుడు బేస్‌ప్రైస్‌ను ప్రభుత్వం ప్రకటించకపోయినప్పటికీ.. టెండర్ వేసిన నాలుగు సంస్థల్లో ఐఆర్‌బీ సంస్థ రూ.7272 కోట్లు, దినేష్‌చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రా రూ.7007 కోట్లు, గవర్ కన్‌స్ట్రక్షన్ రూ.6767 కోట్లు, ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న ఈగల్ ఇన్‌ఫ్రా రూ.5643 కోట్ల మేర బిడ్‌లను కోట్ చేశాయి. అత్యధికంగా కోట్ చేసిన ఐఆర్‌బీ సంస్థను.. 'మరింత అధికంగా చెల్లిస్తారా?' అని ప్రభుత్వ వర్గాలు కోరగా రూ.7380 కోట్లు చెల్లించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఓఆర్ఆర్‌పై ఏటా పెరిగే వాహనాలు, 3 నుంచి 4 శాతం మేర పెరిగే టోల్ చార్జీలతో ఏడాదికి కనీసం ఐదు శాతం ఆదాయం పెరిగినా సర్కారుకు భారీగా ఆదాయం పెరుగుతుంది. అయినా.. 30 ఏళ్ల లీజుకు బేస్‌ప్రైస్‌ను రూ.7300 కోట్లుగా నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఓఆర్ఆర్ టీవోటీ ఫైనాన్షియల్ బిడ్‌ల ఇనిషియల్ ఎస్టిమేటెడ్ కన్సెషన్ వాల్యూను (ఐఈసీవీ) నిర్ధారించడానికి అప్పట్లో ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీయే రూ.7380 కోట్ల లీజు చెల్లించడానికి ఐఆర్‌బీ సంస్థను ఒప్పించినట్లు తెలిసింది. ఈ మేరకు.. గత ఏడాది ఆగస్టు 12 అర్ధరాత్రి నుంచి ఓఆర్ఆర్ ప్రైవేటు సంస్థ లీజులోకి వెళ్లగా, 11వ తేదీనే ప్రభుత్వానికి రూ.7380 కోట్ల చెక్కు అందింది. దాన్ని హెచ్ఎండీఏ ఖాతాలో 12న జమ చేయగా, మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు మళ్లించారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ మహా నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు వాడతామని.. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ, ఆ సొమ్మును రైతు రుణమాఫీకి వినియోగించినట్లు సమాచారం.

రహదారులు రక్తసిక్తం!

» రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం

కొత్తకోట, సదాశివపేట, పటాన్ చెరు, బోయినపల్లి, మార్చి 4: రాష్ట్రంలో రహదారులు రక్తసిక్తమయ్యాయి! వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం చెందారు. నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబసభ్యుల కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని వారిలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణం బసవన్నకుంటకు చెందిన సలీమాబీ మనవడు అలీకి హైదరాబాద్‌లోని ఓ కుటుంబంతో పెళ్లి సంబంధం ఖాయమైంది. సోమవారం హైదరాబాద్‌లో నిశ్చితార్థం ఉన్నందున సలీమా బీ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఎర్టిగా కారులో బళ్లారి నుంచి బయలుదేరారు. అలీ డ్రైవింగ్ చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కొత్తకోట సమీపంలోని బైపాస్ రోడ్డులో వారి కారు జాతీయ రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. దీంతో ఘటనా స్థలంలోనే అబ్దుల్ రెహమాన్ (39), రుమానా (2), సలీమా బీ (95), రోషిణి (4), హసిఫా రిఫాత్ (7 నెలలు) మృతి చెందారు. అలీ, షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. అతివేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో చిన్నదెబ్బ కూడా తగలకుండా సమీరా (8) బయటపడింది.

ఇదిలా ఉండగా.. బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ దుర్మరణంపాలైన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. సదాశివనగర్‌కు చెందిన దంపతులు ఏనుగు జనార్దన్ రెడ్డి(49), ఏనుగు ప్రతిభ (42) మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు స్కూటీపై బయలుదేరారు. పద్మాజీవాడి వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి వారిద్దరూ కింద పడ్డారు. ప్రతిభపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. జనార్దన్ కాలుపై నుంచి కూడా వాహనం వెళ్లడంతో కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. అతన్ని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. కాగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన సూరజ్(34), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(30) అనే భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి ఐనోల్ మీదుగా కంజర్ల గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఇదిలా ఉండగా..రోడ్డు పక్కన పార్క్ చేసివున్న బొలేరో వాహనాన్ని షేక్ మహ్మద్ హుస్సేన్ (14) అనే విద్యార్థి నడుపుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శనివారం జరిగిన ఘటనలో అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా వెనుక కూర్చున్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.



వనపర్తి జిల్లా ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఔటర్‌పై కారు ఢీకొని.. ఆర్మీ జవాన్ దుర్మరణం

నార్సింగ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి ఎయిర్‌పోర్టు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్మీ జవాను మృతిచెందాడు. నార్సింగ్ వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. ప్రమాదం అనంతరం వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మృతుడు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, అయన పేరు కులాన్ అని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే కులాన్‌ను ఓ రెడీ మిక్సర్ వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఘటన తర్వాత కులాన్ మృతదేహం చాలా సేపటి దాకా అక్కడే ఉందని, వాహనదారుల్లో ఎవ్వరూ పట్టించుకోలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. మరి.. కులాన్ ఔటర్ రింగ్ రోడ్డువైపుకు ఎందుకు ఎక్కాడు? ఎక్కడికి వెళుతున్నాడు? అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పాదచారులకు ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశం ఉండదు. కొంతమంది ఎయిర్ పోర్టుకు గానీ, గచ్చిబౌలికి గానీ వెళ్లాలన్నా ఔటర్ రింగ్‌రోడ్డుపైకి ఎక్కి షేరింగ్ ట్యాక్సీలను ఆపి ఎక్కడం లేదా లిఫ్ట్ అడిగి ఎక్కడం చేస్తుంటారు. ఆ రకంగా ఇతను ఎక్కడకైనా వెళ్లేందుకు వచ్చాడా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం అక్రమాలపై న్యాయవిచారణ

» కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్3(1) ప్రకారం ఆదేశిస్తాం

» సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఎంక్వైరీ

» మా విజ్ఞప్తి మేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ కమిటీ

» హైకోర్టుకు లిఖితపూర్వకంగా నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

» కాంగ్రెస్ నేత నిరంజన్ పిటిషన్ నాలుగు నెలలకు వాయిదా

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలపై న్యాయవిచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు లిఖిత పూర్వకంగా తెలిపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 సెక్షన్ 3 (1) అధికారాలను ఉపయోగించుకుని విచారణకు ఆదేశిస్తామని నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోమారు విచారణ చేపట్టింది. దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియజేయాలన్న హైకోర్టు గత ఆదేశాల మేరకు.. అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ వాదనను ధర్మాసనానికి తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నిరుడు అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి.. ప్రాథమిక విచారణ చేపట్టిందని.. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుకు కారణాలు వివరిస్తూ గత నవంబర్ 1న ప్రభుత్వానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని అథారిటీ తన లేఖలో సూచించిందని ఏజీ పేర్కొన్నారు. "డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక దర్యాప్తును పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. సదరు ప్రాథమిక నివేదిక ఆధారంగా ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంది. ఈఎన్సీ (ఐ) రామగుండం ఎన్.వెంకటేశ్వర్లు సర్వీసును టెర్మినేట్ చేశాం. దాంతోపాటు ఈఎన్సీ (జనరల్)ని రాజీనామా చేయాల్సిందిగా కోరాం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తుది నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులైన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం." అని వివరించారు. అలాగే.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలంటూ ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్ఏకి లేఖ రాసిందని.. ఈమేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్ఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ మార్చి 1న ఆదేశాలిచ్చిందని వెల్లడించారు. బరాజ్‌ల దుస్థితికి కారణాలు.. పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫారసు చేయనుందని చెప్పారు. ప్రభుత్వ వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో విచారణను నాలుగు నెలలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

ప్రశాంతంగా కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కరీంనగర్ టౌన్, మార్చి 4: ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం నిర్వహించిన మ్యాథ్స్‌ఎ, పొలిటికల్ సైన్స్, బాటనీ పరీక్షలకు జనరల్ విభాగంలో 447 మంది, ఒకేషనల్ విభాగంలో 193 మంది మొత్తం 640 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 16,100 మంది, ఒకేషనల్‌లో 1556 మంది మొత్తం 17,656 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి తెలిపారు. జిల్లాలో ఎక్కడ కూడా కాపీయింగ్ జరగలేదని ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

రాష్ట్ర సదస్సుకు ఉద్యమకారులు తరలి రావాలి

సుభాష్‌నగర్, మార్చి 4: తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సదస్సుకు తరలి రావాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ వంటి డిమాండ్లకు మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చామన్నారు. ఈనెల 12న రాష్ట్ర అధ్యక్షుడు నీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల మాధవి, ఉపాధ్యక్షురాలు ఆర్ సునీత, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లికార్జున శైలజ, జిల్లా అధ్యక్షురాలు గర్షకుర్తి ఉమారాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి లత, టౌన్ అధ్యక్షురాలు పోగుల కవిత, అరెల్లి బాలమణి, కొలిపాక ఎల్లవ్వ, సోడ పద్మావతి పాల్గొన్నారు.

కరాటేలో స్నేహజ్యోతికి బంగారు పతకం



స్నేహజ్యోతికి పతకాన్ని అందజేస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 4: ఉమ్మడి జిల్లా పరిధిలోని వేములవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన సీఎస్‌కెఐ క్రీడాకారిణి స్నేహజ్యోతి పాల్గొని బంగారు పతకాన్ని సాధించింది. ఈనెల 3న జరిగిన ఈ పోటీల్లో 18 సంవత్సరాల వయసు విభాగంలో పాల్గొన్న ఆమె బంగారు పతకం సాధించినట్లు సీఎస్‌కెఐ చీఫ్, తెలంగాణ రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. స్నేహజ్యోతి బంగారు పతకాన్ని సాధించడంపై సీఎస్‌కెఐ ఛైర్మన్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్యదర్శి మాడుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీధర్, ఉపాధ్యక్షుడు పెద్ది సందీప్ అభినందించారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ రూరల్, మార్చి 4: కరీంనగర్ ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ సెలెక్షన్స్ సోమవారం కొత్తపల్లి పట్టణంలోని అకాడమిక్ హైట్స్ పాఠశాలలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్స్ బాలుర విభాగంలో కరీంనగర్, గోపాల్‌రావుపేట, రామడుగు, కోరుట్ల, మల్యాల్, జమ్మికుంట, ఎస్ఆర్ఆర్ కళాశాల, గంగాధర, ముస్తాబాద్, హుస్నాబాద్, గుల్లకోట నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8నుంచి 10వ తేదీ వరకు వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ హైట్స్ పాఠశాల ఛైర్మన్ సుజిత్‌రావు, శిరీష, ప్రిన్సిపాల్ శైలజ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీర్ల వెంకటేశ్వర్ రావు, బసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, పెద్దపల్లి సురేందర్, సిరిసిల్ల కృష్ణహరి, పీఈటీ శ్రీధర్, విజయ్, సూర్య, అమర్ సాయి, శివాజి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు

కరీంనగర్ టౌన్, మార్చి 4: నగర పాలక సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు శివారు, విలీన డివిజన్లలో కూడా మౌలిక సదుపాయాల వంటి పనులను చేపడతామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. సోమవారం నాలుగో డివిజన్ ఖాన్‌పురాలో కార్పొరేటర్ నుజహాత్ ఫర్హీన్ అలీతో కలిసి రూ.16 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ, ఇతర నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నాలుగేళ్ళుగా మా పాలకవర్గం మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ సహకారంతో పెద్దఎత్తున నిధులు కేటాయించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇంకా కొత్త పనులతోపాటు పెండింగ్ పనులను కూడా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, డీఈ అయూబ్, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు నిజాం, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్, మార్చి 4: హుజూరాబాద్ పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా లేఅవుట్లు చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి రవీందర్ తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ చేయకుండా డీటీసీపీ అనుమతులు లేకుండానే ప్లాట్లు విక్రయిస్తున్నారని తెలిపారు. చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

10న గౌడ ఆత్మీయ సమ్మేళనం

హుజూరాబాద్, మార్చి 4: ఈ నెల 10న కరీంనగర్‌లో జరిగే గౌడ ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను సోమవారం హుజూరాబాద్ పట్టణంలో గీతకార్మికులు ఆవిష్కరించారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతారని, అధిక సంఖ్యలో గౌడ కులస్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నేరెళ్ల మహేందర్‌గౌడ్, రాంశంకర్, రమేష్, శ్రీనివాస్, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష

గన్నేరువరం, మార్చి 4, మండల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో మండల కేంద్రంలోని వారసంతలో సోమవారం ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 60మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 50మందికి కంటి ఆపరేషన్ అవసరాన్ని గుర్తించి వారిని రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచిత ఆపరేషన్ కోసం బస్సులో తీసుకెళ్లారు. లయన్స్ జోన్ ఛైర్మన్ బొడ్డు సునీల్, గంప వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నరసయ్య ఎన్నిక



నూతనంగా ఎన్నికైన నరసయ్యను సన్మానిస్తున్న ఆర్య వైశ్యులు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 4: జమ్మికుంట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కెఆర్‌వి నరసయ్య సోమవారం ఎన్నికయ్యారు. నరసయ్య తన ప్రత్యర్థి గర్రెపల్లి వెంకటేశ్వర్లుపై 21ఓట్ల మెజార్టీతో గెలపొందినట్లు ఎన్నికల అధికారులు పబ్బతి రాజ్‌గోపాల్, కన్వీనర్ ముక్క వెంకన్నలు ఒక ప్రకటనలో తెలిపారు. నరసయ్యకు మద్దతు తెలిపిన కొండ్ల పాపయ్యకు ఏడు ఓట్లు వచ్చాయని, రెండు ఓట్లు చెల్లలేదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహా సభ జిల్లా అధ్యక్షులు చందా రాజు, డివిజన్ అధ్యక్షులు ఎలిమిళ్ల రాజేంద్ర ప్రసాద్, పట్టణ అధ్యక్షులు అయిత మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూమిని రక్షించాలని వినతి

ఇల్లందకుంట, మార్చి 4: మండల కేంద్రంలోని బీరప్ప గుడికి సంబంధించిన భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, ఆ భూమిని గొల్ల కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప దేవాలయానికి ఉంచాలని సోమవారం తహసీల్దార్ రాణికి గొల్ల కురుమలు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తిరుపతి, స్వామి, కుమార్, గట్టయ్య, అయిలయ్య, మల్లయ్య ఉన్నారు.

అన్నారంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు

మానకొండూర్, మార్చి 4: మండలంలోని అన్నారంలో కరీంనగర్‌లోని వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శీతకాల శిబిరం సోమవారం ప్రారంభమైంది.మాజీ సర్పంచులు బొట్ల కిషన్, గోపు శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, దయాకర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గణేశ్‌నగర్, మార్చి4: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, స్టేట్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బీఎస్‌రావు సూచించారు. శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్‌పై సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ యువత మెరుగైన వైద్య సదుపాయల కల్పన గురించి ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నరు. బీఎస్ రావు ఫౌండేషన్ ద్వారా నిర్వహించబడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. యువత



మాట్లాడుతున్న బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీఎస్‌రావు

సమాజంలో జరిగే అవినీతిని అక్రమాలను ప్రశ్నించే విధంగా తయారవ్వాలన్నారు. ఈసందర్భంగా మొన్న జరిగిన జర్నలిస్టు శంకర్‌పై పథకం ప్రకారం దాడి చేశారని సమాజంలోని అన్ని వర్గాలు దీన్ని తీవ్రంగా ఖండించా లన్నారు. జర్నలిస్టులు ధైర్యంగా వాస్తవాలను బయట పెడుతున్నారన్నారు. దీంతో పాలకులు భయప డుతూ ఇలా కక్ష కడుతున్నారన్నారు. ప్రజా పాలనలో ఇలాంటి ధోరణిని మానుకొని అరాచకాలను వెంటనే ఆపా లన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హరికాంత్, డాక్టర్ ఎం.మనోజ్ కుమార్, బి.నరేష్, డాక్టర్ బి.పరశురాములు, డాక్టర్ టి.క్రిష్ణకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయ హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, మార్చి 4: నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీలను ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ పాము సత్యనారాయణ నేతృత్వంలో సోమవారం లెక్కించారు. సెప్టెంబరు-23, 12-9-2023 నుంచి 4-3-2024 వరకు పద్నాలుగు లక్షల ముప్పై ఐదు వేల రెండు వందల డెబ్బై ఐదు రూపాయాల ఆదాయ వచ్చినట్లు ఈఓ వుడుతల వెంకన్న తెలిపారు. లెక్కింపులో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

'కరీంనగర్ పార్లమెంట్ టికెట్ బీసీలకే ఇవ్వాలి'

గణేశ్‌నగర్, మార్చి 3: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కరీంనగర్ పార్లమెంట్ టిక్కెట్లు బీసీలకే ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు కోరారు. సోమవారం కరీంనగర్‌లో బీసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ బీసీ అభ్యర్థికే టికెట్ కేటాయించిందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడా బీసీ అభ్యర్థికే సీట్ కేటాయించాలని కోరుతున్నామని అన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, శివ, శ్రవణ్ పాల్గొన్నారు.

అనువాదం ఒక పరిశ్రమగా మారింది

కరీంనగర్ కల్చరల్, మార్చి4: వర్తమాన ప్రపంచీకరణ నేపథ్యంలో దేశాల నడుమ, భాషల మధ్య దూరాలు తగ్గి అనువాద ప్రక్రియ ఒక పరిశ్రమగా మారిపోయిందని జిల్లాకు చెందిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, రచయిత, అనువాదకుడు వారాల ఆనంద్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీలో జరిగిన జాతీయస్థాయి సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. యువతీ యువకులు కనీసం రెండు భాషల్లో నైపుణ్యం సాధిస్తే వృత్తి అనువాదకులుగా నిలదొక్కుకోవచ్చని అన్నారు. ఈ సెమినార్‌లో ఆచార్య విశ్వష్ట, ఆచార్య అరుణకుమారి, ఆచార్య అజీజ్ బానో, ఆచార్య రత్నాకర్, ఆచార్య శేషుబాబు, ఆచార్య భీంసింగ్, ఆచార్య పార్వతి, అనూరాధపాండే పాల్గొన్నారు.

'బల్దియా టెండర్లలో అవకతవకలపై విచారణ జరిపించాలి'

కరీంనగర్ టౌన్, మార్చి4: నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనుల టెండర్ల నిర్వహణలో డ్రాయింగ్ బ్రాంచ్ సెక్షన్ డీఈఈ లచ్చిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ హమీద్ అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని, వీటిపై విచారణ జరిపించాలని కాంట్రాక్టర్ దుగ్గు రాకేశ్ మహేందర్ కోరారు. సోమవారం ఆయన కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. నిబంధన లకు విరుద్ధంగా కండీషన్లను చేర్చుతూ టెండర్లలో వారికి నచ్చిన కాంట్రాక్టర్‌కు పనులు వచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కాపువాడ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.10.52 లక్షల పట్టణ ప్రగతి నిధులతో పిలిచిన టెండర్ నోటీసు నెంబర్ ఇ1/డీబీ/ఎంసీకె/8201/130/2022-23/2 తేదీ 18.1.23ద్వారా పిలిచిన టెండర్లలో రెండు బిడ్స్ దాఖలు కాగా కొంత సమయం కాలయాపన చేసి టెండర్‌ను ఓపెన్ చేయకుండా రద్దు చేశారన్నారు. వాటికి సంబంధించిన డీడీలను వాపసు ఇచ్చి టెండర్‌లోని అంచనాలను మార్చి తిరిగి టెండర్లను పిలిచి వారికి ఇష్టమైన వారికి పని అప్పగించారని ఆరోపించారు. 29వ డివిజన్ కాపువాడలో నిర్మించతలపెట్టిన కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను కూడా నిలిపి వేయాలని కోరారు.

బల్దియా దుకాణాలకు భారీ పోటీ

-151 దుకాణాలకు 1,092 దరఖాస్తులు

-7న కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో కేటాయింపు

కరీంనగర్ టౌన్, మార్చి4: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన వాణిజ్య సముదాయాల దుకాణాలను అద్దెకు తీసుకునేందుకు ప్రజలు పోటీపడ్డారు. నగరపాలక సంస్థ ఆదాయ మార్గాలను పెంచుకోవడంతో పాటు రోడ్లపై ఉన్న దుకాణాలను తొలగించి వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం చూపేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మూడు వైపులా 126 దుకాణాలతో వాణిజ్య సముదాయాన్ని నిర్మించింది. శాతవాహన యూనివర్సిటీ సమీపంలో 25దుకాణాలతో మరో సముదాయాన్ని నిర్మించింది. మొత్తం 151 దుకాణాలను నామమాత్రపు అద్దెలతో వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులకు కేటాయించేందుకు లాటరీ నిర్వహిస్తామని, దుకాణాలు తీసుకోవాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ప్రకటన జారీ చేశారు. మొత్తం 151 దుకాణాలకు 1,092 మంది వేయి రూపాయల డీడీని జత చేసి సమర్పించారు. కొంత మంది డీడీలు లేకుండా కేవలం దరఖాస్తులను మాత్రమే సమర్పించారు. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు డీడీలు సమర్పించిన వారి పేర్లను మాత్రమే లాటరీ వేసి దుకాణాలను కేటాయిస్తారు. గురువారం మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్ ఆవరణలో దుకాణాలకు లాటరీ తీసి కేటాయిస్తామని పేర్కొన్నారు. చాలా రోజులుగా ఆయా ప్రాంతాల్లో వ్యాపారం చేసుకొని జీవిస్తున్నామని, తమకు దుకాణాలను కేటాయించి ఉపాధి కల్పించాలని వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులు కోరుతున్నారు. మరోవైపు చాలా మంది వ్యాపారులు తమకు కూడా దుకాణాలను కేటాయించాలని లాటరీ తీసి పారదర్శకంగా దుకాణాలను కేటాయించాలని కోరుతున్నారు.

'పద్మజ సంతాన సాఫల్య కేంద్రాన్ని సీజ్ చేయండి'

సుభాష్‌నగర్, మార్చి 4: జిల్లా కేంద్రంలో ఉన్న పద్మజ సంతాన సాఫల్య కేంద్రాన్ని సీజ్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అధ్యక్షుడు బోనగిరి మహేందర్, కార్యదర్శి బ్రాహ్మణపెల్లి యుగేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా పేరుపాలెం గ్రామానికి చెందిన దంపతులు సంతానం లేకపోవడంతో వారు నగరంలోని పద్మజ సంతాన సాఫల్య కేంద్రానికి వచ్చారని తెలిపారు. వారి నుంచి లక్షల రూపాయలు దోచుకొని వైద్యం అందించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సంతానం లేనివారికి సంతానం కల్పిస్తామని చెబుతూ రూ. 2లక్షల నుంచి 10 లక్షల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఐవీఎఫ్ సెంటర్లను తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. పద్మజ ఆసుపత్రిలో జరుగుతున్న అక్రమాలపై అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఆర్టీసీ లక్కీడ్రా విజేతల ఎంపిక

భగత్‌నగర్, మార్చి 4: గత సంవత్సరం బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ఆర్టీసీ నిర్వహించిన లక్కీ డ్రాను రీజినల్ మేనేజర్ సుచరిత ఆధ్వర్యంలో విజేతలను ఎంపిక చేశారు. గత సంవత్సరం అక్టోబరు 18 నుంచి 30 వరకు రీజియన్ పరిధిలోని అన్ని బస్‌స్టేషన్‌లలో డ్రా బాక్సులను ఏర్పాటు చేశారు. లక్కీ డిప్‌కు సంబంధించిన డ్రాను ప్రయాణికుల సమక్షంలో నిర్వహించి పది మంది విజేతలను ప్రకటించారు. విజేతలకు ఒక్కొక్కరికి పది వేల రూపాయలు హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో అందిస్తారు. ఈకార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్లు ఎస్.భూపతిరెడ్డి, కె.సత్యనారాయణ, డిపో మేనేజర్ ఎల్.మల్లేశం, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పి.రజనీకృష్ణ పాల్గొన్నారు.

గత ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు హామీలు అమలు చేయం

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మార్చి4: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు తప్పుడు హామీలను ఇచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయదనిమానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. తిమ్మాపూర్ మండల సమావేశం సోమవారం ఎంపీపీ కేతిరెడ్డి వనిత అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేసవి దృష్ట్యా ప్రజలకు మంచి నీటి సమస్యలు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. మొగిలిపాలెం ఎంపిటిసి పాశం తిలక్ ప్రియా లేచి స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునేందుకు చాలా మందికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రొసీడింగ్‌లు ఇచ్చిందని ఇళ్లకోసం వారు ఎదురు చూస్తున్నారని ఎమ్మెల్యేను అడిగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కేతిరెడ్డి వనిత, వైస్ ఎంపిపి ల్యాగల వీరారెడ్డి, తహసీల్దార్ కనకయ్య, ఎంపిడివో విజయ్‌కుమార్, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

తిమ్మాపూర్: కరీంనగర్ ఎంపీగా ఐదేళ్ల పదవీకాలంలో మానకొండూర్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎంపీ బండి సంజయ్‌కు సవాల్ విసిరారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు 14మంది దరఖాస్తు చేసుకున్నారని, అభ్యర్థి ఎవరైనా కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ మతం పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోరపల్లి రమణ రెడ్డి, జిల్లా మండల నాయకులు శ్రీగిరి రంగారావు, ఎస్ఎల్ గౌడ్, తిరుపతి రెడ్డి, ఇతర నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ముందస్తు మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్, మార్చి 4: హుజూరాబాద్ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో పట్టణ సమైఖ్య ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవం వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జి కల్యాణి, సుజాత, సరస్వతీ, పావని, అరుణ, మోహన్‌రాయ్, శ్రీవాణి, మానస, రమాదేవి, స్వరూప, అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

మానకొండూర్, మార్చి 4: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన కుంబాల రమాలక్ష్మీ (61) అనే మహిళ ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. రమాలక్ష్మీ సోమవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లి కనిపించలేదు. కుటుంబ సభ్యులు గాలించగా సమీపంలోని వ్యవసాయబావిలో మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభం

గన్నేరువరం, మార్చి 4, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంలో భాగంగా ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ పథకాల కోసం దరఖాస్తులను మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో శంకర్ ప్రారంభించారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మండల ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో కారోబార్ మాధవరావు,కంప్యూటలర్ ఆపరేటర్ శివసాయి ఉన్నారు.

సైదాపూర్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కోసం గతంలో దరఖాస్తు చేసుకోని లబ్ధిదారులు హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం అందించిన గ్రామస్థులు

వీణవంక, మార్చి4: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన దుకిరె రాజు ఇటీవల మృతి చెందాడు. రాజుకు ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. గ్రామస్థుడు కర్ణకంటి భాస్కర్‌రెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో వాట్సప్ గ్రూపు చేసి రాజు కుటుంబాన్ని అదుకోవాలని కోరాడు. దీంతో గ్రామస్థులు, ఇతరులు స్పందించగా రెండు లక్షల రూపాయలు సమకూరాయి. గ్రామస్థుల సహాయంతో డబ్బులను పిల్లల పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాధిత కుటుంబానికి అందించారు.

మాజీ మంత్రి ఈటలను కలిసిన బీజేపీ నాయకులు

ఇల్లందకుంట, మార్చి4: మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ను ఇల్లందకుంట బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి హైద్రాబాద్‌లోని తన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈటల రాజేందర్‌కు మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల తిరుపతిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఈటలను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

ఎస్సారార్ కాలేజీలో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

గణేశ్‌నగర్, మార్చి 4: ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఇన్‌కమ్‌టాక్స్ అసెస్‌మెంట్ ఆఫ్ ఇండివిజువల్స్‌పై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్టిఫికెట్ కోర్సులో చేరబోయే ఆసక్తిగలవారు కనీస విద్యార్హతగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత అయి ఉండాలి ఈ కోర్సు ప్రవేశ రుసుము 1000 రూపాయలు. దరఖాస్తులను ఈ నేల 6 నుండి 13 వరకు కామర్స్ డిపార్ట్మెంట్లో స్వీకరించబడును వివరాలకు ఈ క్రింది నెంబర్లను 9703165311,9492365876 సంప్రదించగలరు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

సుభాష్‌నగర్, మార్చి4: నాల్గవ తరగతి ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందజేసినందుకు సోమవారం తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి దూల్గుంటి నరసింహారెడ్డి, నగర శాఖ అధ్యక్షుడు పి శ్రీనివాస్, కార్యదర్శి శంకరయ్య, జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు దేవేంద్ర, కొమురయ్య, అశోక్, మహబూబ్‌అలీ, లక్ష్మిరాజం, ముజీబ్ అహ్మద్‌ఖాన్, మంజుల, రాధమ్మ, కిరణ్, సతీష్, అనిత, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

కరీంనగర్ క్రైం, మార్చి4: కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామానికి చెందిన జింక రాజేందర్(30) ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్ళి అదృశ్యమయ్యాడని కుటుంబసభ్యులు సోమవారం ఫిర్యాదు చేశారని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఏటీఎం నుంచి డబ్బులు తీసుకు వస్తానని చెప్పి బయటకు వెళ్ళిన రాజేందర్ ఇంటికి రానందున బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెదికినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి4: ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని డైనమిక్ జిమ్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ జట్ల ఎంపిక పోటీలకు చక్కటి స్పందన లభించింది. సోమవారం నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జూనియర్, సబ్ జూనియర్, సీని యర్ విభాగాల్లో 50 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. ఈపోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 9,10 తేదీల్లో హైదరాబాద్, సంగారెడ్డిలలో జరిగే పవర్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సబ్ జూనియర్ విభాగంలో వై.గణేశ్, టి.విశాల్, జూనియర్స్ విభాగంలో ఎస్.రాజేశ్, వివేక్, డి.వినయ్, డి.మధూకర్, డి.నవీన్, మాస్టర్స్ విభాగంలో చంద్రబాబు, చంద్రమౌళి, బాలికల విభాగంలో టి.సిరిచందన, మాధురి, సీనియర్ విభాగంలో డి.శ్రీలత ఎంపికైనట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు ఎస్.దామోదర్, ఎడ్ల నాగరాజు తెలిపారు. వీరిని కోశాధికారి వి.మల్లేశం, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ టౌన్: నగరంలోని 40వ డివిజన్ ఆదర్శనగర్‌లో జరిగిన అగ్నిప్రమాదం, పేలుళ్ళతో గుడిసెలు దగ్ధమైన ఘటనపై జరిగిన విచారణతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని వావిలాలపల్లికి చెందిన ఎం.శ్రీనివాస్ కుమార్ జిల్లా అధికారులను కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సమక్షంలో అర్బన్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించామని ఆయన తెలిపారు.

●కరీంనగర్ రూరల్: కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాంతినగర్‌లో రెండో రోజు పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్య తిరుపతి నాయక్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆశావర్కర్ శారద, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: హుజూరాబాద్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా లే అవుట్లు చేస్తు ప్రజలను మోసం చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి అక్రమ వెంచర్లను నిలిపి వేయాలని కోరారు.

● కరీంనగర్ క్రైం: కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్) బలగాలు సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

● చొప్పదండి: పట్టణంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు సోమవారం కవాతు నిర్వహించాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కవాతు నిర్వహించినట్లు సీఐ ప్రకాశగౌడ్ తెలిపారు.

● సైదాపూర్: మండలంలోని జాగీర్‌పల్లి గ్రామంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.తొంట ఇంద్ర సేన, భాస్కర్, అనిల్ పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామం లో సోమవారం పశువైద్యులు డాక్టర్ బిల్లకంటి మాధవ రావు ఆధ్వర్యంలో 177 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

● చొప్పదండి: మండలంలోని రేవెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం మాజీ విద్యా కమిటీ ఛైర్మన్ ఇరుగురాళ్ల అంజయ్య పండ్లు పంపిణీ చేశారు. తన జన్మదినం పురస్కరించుకొని అంజయ్య విద్యార్థులందరికీ పండ్లను అందజేశారు.

● గంగాధర: హిమ్మత్‌నగర్, కొండయ్యపల్లి గ్రామా ల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

● హుజూరాబాద్‌రూరల్: పురుగు మందులను పిచికారి చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని డబ్ల్యూ డబ్ల్యూఎఫ్-నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ-టీసీఐ ప్రాజెక్టు సమన్వయకర్త ఈసోని అన్నారు. తుమ్మనపల్లిలో అవగాహన కల్పించారు.

● సైదాపూర్: ఈ నెల 12న హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా ఛైర్మన్ కనకం కుమారస్వామి అన్నారు.

● మానకొండూర్: మండలంలోని పచ్చునూర్‌లోని పాథమిక పాఠశాల (యాదవనగర్) అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు రొంటాల సందీప్ రెడ్డి రూ.30వేల చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గొల్ల శ్రీదేవికి సోమవారం అందజేశారు.

● జమ్మికుంట: పట్టణంలో రెండవ విడుత దళిత బంధు రాని బాధితులు సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. దళితరత్న అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ మాట్లాడుతూ రెండవ విడుత దళితబంధు సకాలంలో రావడం కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.

● గంగాధర: గ్రామానికి చెందిన బొయిని లచ్చయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. పేదకుటుంబానికి చెందిన లచ్చయ్య అంత్యక్రియలకు తన వంతుగా మాజీ సర్పంచ్ విజేందర్‌రెడ్డి 5వేలు ఆర్థిక సహాయం అందించాడు.

● వీణవంక: మండలంలోని ఎల్బాక చల్లూరు గ్రామాల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక టాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.